
# మందుగుండు



మారుమూల గ్రామంలో ఏడో క్లాసు వెలగబెట్టిన వెర్రి వెంగళాయప్ప ముకుందరావు, తనకు పెళ్ళి నిశ్చయమైతే, ఏడుకొండలవాడి దర్శనం చేసుకుని తలనీలాలు సమర్పించుకుంటానని మొక్కుకున్నాడు. దేవుడి దయవల్ల పెళ్ళి నిశ్చయమైంది. చివరి గడియల్లో తన వెర్రివాగన్న పెళ్ళి చూసి కళ్ళు మూయాలని ఎంతో ఆశతో వున్న బామ్మ కలలు పండాయి. ఆనందంతో సంతోషబాష్పాలు రాల్చింది.

ముకుందరావు తన కోరిక బామ్మతో వెలిబుచ్చాడు. దైవభక్తి మెండుగా వున్న బామ్మ తగినంత డబ్బిచ్చి, ముకుందరావును తిరుపతికి ప్రయాణం చేసింది. వీడికి తోడు మొద్దు సన్యాసి తిరుమలరావు కూడా ప్రయాణం అయ్యాడు.

అతిప్రయాసల కోర్చి తిరుపతి చేరుకున్నారు. తిరుపతినుంచి బస్సు తిరుమలకు బయలుదేరింది. వెనకసీట్లో కూర్చున్న ముకుందరావు, ప్రతి మలుపులో జాగ్రత్తపడుతున్నాడు. డ్రైవర్ సడన్‌గా బ్రేక్ వేయడం, ముకుందరావు ఒకావిడ మీద పడడం, ఆమె భర్త లెంపకాయ వేయడం, ముకుందరావు ముక్కులో వున్న అమృతం చిరుజల్లులా అందరిమీద పడడం త్రుటిలో జరిగిపోయింది. ప్రభుత్వం ఏర్పరచిన ఉచిత గుండు సౌకర్యం వినియోగించుకున్నా, క్షురకారుడికి దక్షిణ సమర్పించనందువల్ల, వాడి పగ గుండుమీద కొట్టొచ్చినట్టు కనపడింది ఇద్దరి మిత్రుల్లో. శ్రీవారి గంధం గుండుపైన పూస్తున్నప్పుడు మందులా భావించాడు ముకుందరావు.

దైవ దర్శనం గావించి, తిరుగు ప్రయాణంలో బస్సెక్కబోయిన ముకుందరావు, బస్సులో వ్రాసిన జాగ్రత్తలు చదివి, వెంటనే తన మిత్రునితో సహా బస్సు టాప్ మీద చేరిపోయాడు. ప్రతి మలుపులో బస్సు టాప్ మీద శబ్దం అవుతుండడంతో కండక్టర్ బస్సు ఆపి, టాప్ మీద చూశాడు. ఇద్దరు మిత్రులు వీరోచితంగా ఇనుప కడ్డీలు పట్టుకుని పడుకుని వున్నారు. కండక్టరు వారిని క్రిందికి దిగమన్నాడు.

"బస్సులో వ్రాసిన జాగ్రత్తలు మీరు చదివారా?" అన్నాడు ముకుందరావు అమాయకంగా.

ఏం?" కండక్టర్ సమాధానం.

"మందుగుండు సామానులు లోనికి తేరాదు" ముక్తసరిగా ద్వికంఠాలు పలికాయి గుండుమీద వేలెత్తి చూపుతూ.

గంధాన్ని మందు అనుకుంటున్న వారిద్దరిని చూసి, కండక్టర్ నవ్వు ఆపుకోలేకపోయాడు. బస్సులో అందరి నవ్వులు కండక్టర్ నవ్వుతో శ్రుతి కలిపాయి.

— ఆర్.ఆర్.రెడ్డి

# ...ప్చ్

"పక్కింటి సుందరం పిన్నిగారబ్బాయి ఇంటర్ ఫస్ట్ క్లాసులో పాసయ్యాడట. ఈ స్వీట్సు పంపారు" అని తను చేసిన పూరీ, కూరతో పాటు జహంగీరు, బాదుషా పెట్టిన ప్లేట్లు మా ముందుంచింది రాజ్యం.

"గుడ్, ఆ అబ్బాయిది బై.పి.సి. గ్రూపు కదూ!" అన్నాను ఏదో ఒకటనాలని.

"డాడీ!" పిలిచింది, సంధ్య.

"ఏమ్మా?" అడిగాను, ప్రేమగా.

"మేమంతా ఎల్.కె.జి. పాసై, మరేమో యూ.కె.జి. కొచ్చినందుకు మా షకీలా టీచరు మమ్మల్ని మెచ్చుకున్నారు. ఆవిడ మా క్లాస్ టీచర్లే. ఎంత మంచి టీచరో చాక్లెట్లు పంచారు" అంది ఇంతింత కళ్ళు చేసుకుని సంబరంగా, పాసవ్వడమంటే ఇప్పుడిప్పుడే అర్థం తెలుసుకుంటున్న సంధ్య.

"అవున్రా నంజూ! అందుకే నీకు మళ్ళీ కొత్త బుక్స్ అవీ కొనాలిగా" అన్నాను నా బాధ్యత గుర్తు తెచ్చుకుంటూ.

"డాడీ! మేమంతా పాసయ్యాం. మాతో పాటు సరళా టీచరు, సుగుణా టీచరు కూడా ఎంచక్కా యు.కె.జి. కొచ్చేసారు. మరి... మరేమో పాపం! మా రాధా టీచరు మాత్రం ఎల్.కె.జి. లోనే ఉండిపోయారు. డాడీ! ఆ టీచరు ఎల్.కె.జి. పాసవ్వ లేదా?" మొహమంతా విచారం నింపుకుని అమాయకంగా ప్రశ్నించింది సంధ్య.

ఆ ప్రశ్నకు కడుపు చెక్కలయ్యేలా నవ్వొచ్చింది రాజ్యానికి, నాకు. ఎందుకు నవ్వుతున్నామో తెలీక కోపంతో బుంగమూతి పెట్టి ముందున్న టిఫెన్ ప్లేటు గిరవాటేసింది సంధ్య!

— తూపురాణి రామకృష్ణ

# సంతానం

"ఛీ...ఛీ... ఈ ఇంట్లోకి అడుగు పెట్టాలంటేనే అసహ్యం వేస్తుంది. ఇంట్లో వుండడం కంటే ఏ నరకంలో వున్నా సుఖంగా వుంటుంది" సరళ ఇంట్లోకి అడుగు పెడుతూనే తన అన్న అమ్మపై విరుచుకుపడడం చూసింది.

బెంగుళూరులో వుండే చెల్లెలు ఇంటికి రావడం చూసి లోని కాహ్వానించాడు సుందరం.

"మీ వదినకు, అమ్మకు క్షణం పడదు. ఎప్పుడూ కీచులాడుతూనే వుంటారు. వీరిద్దరి మధ్యా నేను ప్రత్యక్ష నరకాన్ని అనుభవిస్తున్నా" అమ్మపై విరుచుకుపడడానికి కారణాలు వివరిస్తున్నట్టుగా చెప్ప సాగాడు సుందరం చెల్లెలికి.

"అంతేలే! పెళ్ళయ్యేంతవరకే అమ్మ. పెళ్ళయ్యాక వాళ్ళెలా కనిపిస్తారు! ఇల్లు నరకం, కని పెంచినవారు నరకంగా కనిపించడం సహజమే. అమ్మ నీకు భారంగా వుంది. నేను బెంగుళూరు వెళ్ళేటప్పుడు నా వెంబడి తీసుకెళతాను" చెప్పింది సరళ.

ఈ నరకం కన్నా అదే నయమనిపించి అభ్యంతరం చెప్పలేదు సుందరం.

కన్నకొడుకు తనను పట్టించుకోకపోయినా కూతురి ప్రేమకు ఆనందం వేసిందా తల్లికి.

పండుగకు వచ్చిన సరళ తిరిగి వెళ్ళేప్పుడు మొదటి చెప్పినట్టుగానే తనతో పాటు తల్లిని తీసుకెళ్ళింది.

* * *

సరళ భర్త బెంగుళూరులో పేరొందిన వ్యాపారి. సుదర్శనరావు అత్తగారిని చూడగానే సంతోషించాడు. అయితే వారం రోజులైనా ఆమె వెళ్ళక పోవడంతో భార్యను అడగాలా, వద్దా? అనే సంశయంలో పడిపోయాడు. మా అమ్మ శాశ్వతంగా ఇక్కడే వుంటుంది అన్నప్పుడు హాస్యంగా అన్నదనే అనుకున్నాడు.

రోజులు గడుస్తున్నా ఆమె వెళ్ళే సూచనలు కనిపించకపోవడంతో ఓ శుభ ముహూర్తాన భార్యను అడిగేశాడీ విషయాన్ని.

"నేనేం తెలివితక్కువ దాన్ననుకున్నారా? ఈ మహానగరంలో మీరు వ్యాపారంపై వెళ్ళిపోయాక, పిల్లల్ని స్కూల్‌కు పంపి నేను మహిళా సంఘాలకు వెడితే ఇంట్లో మన వారంటూ ఎవరూ వుండరు. మనం నెలకు 400 ఇచ్చి ఓ పని మనిషిని నియమించుకున్నా మన మనిషిలా 24 గంటలు పనిచేయదు. కానీ కేవలం మూడు పూటల తిండితో ఈవిడ ఇంట్లో 24 గంటలుంటుంది. పిల్లల్ని సాకడం, మీరు లేనప్పుడు నాకు తోడుగా వుంటుంది. డబ్బు కోసం యజమానులను చంపే పని మనుషు లెందరో వున్నారు. మనకా ప్రమాదం లేదు. ఇంత చౌకలో ఇంత మంచి పనిమనిషి మనకెక్కడ దొరుకుతుంది చెప్పండి" అంది సరళ.

తన భార్య తెలివికి మురిసిపోతూ "ఆరు నెలల్లో వారు వీరవుతారట. నీకన్నీ నాలానే వ్యాపార బుద్ధులొచ్చాయి" అని మెచ్చుకోసాగాడు సుదర్శనరావు.

— బుద్ధా మురళి